సాక్షి
నంద్యాల
మంగళవారం, 6, మే, 2025



ఈ శ్రమ్ కార్డులపై అవగాహన

ఈ-శ్రమ్ కార్డులపై కార్మికులకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అన్నారు. సోమవారం కర్నూలులో సదస్సు నిర్వహించారు. 8లో▸



తాగునీరు బంద్!

స్కూల్‌కు వేసవి సెలవులని అధికారులు గ్రామానికి మంచినీటిని బంద్ చేశారు. పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ పంపు కనెక్షన్ తొలగించారు. 8లో▸



.. దొరికొంది పులి కళేబరం!

నల్లమల అడవిలో వేటగాళ్ల ఉచ్చుకు కణితి బలైంది. అయితే స్నిఫర్ డాగ్ అధికారులను పులి కళేబరం ఉన్న చోటుకు తీసుకెళ్లింది. 8లో▸

న్యూస్‌రీల్

రైతులకు డీనోటిఫై పత్రాలు



డీనోటిఫై పత్రం అందజేస్తున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): చుక్కల, 22ఏ1 కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించి 11 మంది రైతులకు డీనోటిఫై పత్రాలను ఇచ్చామని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మొత్తం 11 మంది రైతులకు 32.71 ఎకరాల భూములకు డీ నోటిఫై పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు, ఆర్డీఓలు కృషి చేశారన్నారు. బాధిత సర్వే నంబర్ల రైతులను ఐజీఆర్ఎస్ నిషేధిత జాబితాలో డీనోటిఫై చేయాలని, వెబ్ ల్యాండ్ పోర్టల్‌లో మార్పుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మలేరియా, డెంగీ రాకుండా పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ

గోస్పాడు: మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ ఆదేశించారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం నంద్యాల జిల్లా సబ్ యూనియన్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ.. జ్వరం కేసులను త్వరగా గుర్తించి రక్తనమూనాల సేకరించి మలేరియా నిర్ధారణ అయితే వెంటనే ఏఎల్‌టీ, ఫాగింగ్ స్ప్రేయింగ్ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, డెంగీ నివారణ చర్యలపై ఏఎన్ఎం, ఆశా, సీహెచ్‌ఓలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, ఇన్‌చార్జి ఏఎంఓ రామవిజయారెడ్డి, సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలతో పాఠశాల విద్యకు నష్టం

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పాఠశాల విద్యకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఏపీటీఎఫ్(275) జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ప్రియదర్శినికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాయకులు తిమ్మారెడ్డి, రమేష్, నాగేంద్ర, ప్రసాద్, నౌమాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా ఎస్ఈగా పాండురంగయ్య



కర్నూలు సిటీ: హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సర్కిల్-1 పర్యవేక్షక ఇంజనీర్‌గా పాండురంగయ్యను నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయి ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎల్ఎల్‌సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పాండురంగయ్య పని చేస్తున్నారు. హంద్రీనీవా సర్కిల్-1కి రెగ్యులర్ ఎస్ఈ లేరు. గత నెల 30న ఇన్‌చార్జిగా ఉన్న సురేష్ పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం హంద్రీనీవా విస్తరణ పనులు జరుగుతుండడంతో ఖాళీగా ఉన్న ఎస్ఈ పోస్టుకు పాండురంగయ్యను నియమించారు.

- కర్నూలు సర్కిల్ ఎస్ఈగా బాల చంద్రారెడ్డిని నియమించారు. ఈ ఏడాది జనవరి నెలలో రెగ్యులర్ ఎస్ఈలుగా పదోన్నతులు ఇవ్వడంతో ద్వారకనాథ్ రెడ్డి ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించారు. గత నెల 30న పదవీ విరమణ పొందారు. ఖాళీగా ఉన్న ఈ స్థానంలో బాల చంద్రారెడ్డిని ఎస్ఈగా నియమితులయ్యారు.



2002లో చనిపోతే.. 2018లో కోర్టుకు ఎలా వెళ్లారు?



పాలకొలనులోనే కలగొట్ల నాగమ్మ అనే మహిళకు 2 ఎకరాల పొలం ఉంది. ఎకరాకు రూ.4.30లక్షల చొప్పున ఈమెకు రూ.8.60లక్షలు పరిహారం రావాలి. అయితే నాగమ్మ 2002లో చనిపోయారు. భూమిని 2013లో సేకరించారు. కానీ పరిహారం కోసం నాగమ్మ పేరుతో ఓ టీడీపీ నేత 2018లో రిట్ (డబ్ల్యూపీ 42989/2018)దాఖలు చేశారు. అందులో నాగమ్మ వేలిముద్రలను ఫోర్జరీ చేశారు.

అయ్యన్న సంతకాలు ఫోర్జరీ



సర్వేనెంబర్ 232లో అయ్యన్న అనే వ్యక్తికి రెండు ఎకరాల పొలం ఉంది. ఇతనికి కూడా రూ.8.60లక్షలు పరిహారం రావాలి. ఇతను 2008 జూలై 8న చనిపోయారు. ప్రభుత్వం మరణధ్రువీకరణ పత్రం కూడా జారీ చేసింది. అయితే ఇతని పొలాన్ని 2013లో సేకరించారు. పరిహారం కోసం చనిపోయిన అయ్యన్న 2018 నవంబర్ 5న కోర్టులో రిట్(40116/2018) దాఖలు చేశారు. 2002లో చనిపోయిన వ్యక్తి 2018లో కోర్టును ఎలా ఆశ్రయించారో అధికారులకే తెలియాలి.

ఆత్మలు కోర్టుకు.. పరిహారం టీడీపీ నేతకు!



ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ భూసేకరణ కుంభకోణం

- పరిహారం కోసం రైతులకు తెలియకుండా కోర్టుకు
- చనిపోయిన వారి పేరిట రిట్ పిటిషన్‌లు దాఖలు
- ఇప్పటికే 120 మందికి పరిహారం.. త్వరలో మరో 70 మందికి
- ఈ విషయంలో చక్రం తిప్పుతున్న ఓ టీడీపీ నేత
- మంజూరైన పరిహారంలో 50శాతం ఇచ్చేలా ఒప్పందం

సాగులో లేని వాళ్లు ఉన్నట్లు చూపిస్తున్నారు. అసలు ప్రాణాలతో లేని వ్యక్తులు పరిహారం కోసం కోర్టుకు వెళ్లినట్లు సృష్టించారు. ఈ విషయంలో ఓ టీడీపీ నేత చక్రం తప్పారు. ఇప్పటికే కొంతమందికి పరిహారం మంజూరు కాగా, మిగిలిన వారికీ పరిహారం మంజూరు చేయాలని సదరు నేత అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. అయితే ఈ పరిహారం మంజూరులో అక్రమాలు జరిగాయని, తమకు సంబంధం లేకుండా పరిహారాన్ని కాజేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇటీవలే ఈ అక్రమాలపై కొందరు బాధితులు కలెక్టర్ రంజిత్‌బాషాను కలిశారు. ఈ అక్రమాల గుట్టు విప్పితే కళ్లు బైర్లు కమ్మే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి.

నాకు తెలీకుండానే నా పేరుతో కోర్టుకు..



నాకు అరెకరా ఉంది. నాకు రూ.2.15లక్షలు రావాలి. నేను బతికే ఉన్నా. నాకు తెలియకుండా నా పేరుతో టీడీపీ లీడర్ కోర్టుకు వెళ్లారు. నాకు సంతకం రాదు. నేనైతే ఎక్కడా వేలిముద్రలు వేయలేదు. కానీ నేను వేసినట్లు వేలిముద్రలు వేశారట. లేదంటే డ్వాక్రా గ్రూపులోని వేలిముద్రలను తీసుకున్నారేమో తెలీదు. ఇది చాలా అన్యాయం. నా పరిహారం నాకు ఇప్పించాలి. – శేషమ్మ

ఫ్యామిలీకి తెలీకుండా దోపిడీ



నక్కల మద్దిలేటికి సర్వేనెంబర్ 199లో 3.50 ఎకరాలు, సర్వేనెంబర్ 243/5లో 0.88 ఎకరాలు మొత్తంగా 4.38 ఎకరాలు ఉంది. మద్దిలేటి చనిపోయి 20 ఏళ్లు దాటింది. ఈయనకు ఐదుగురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు. వీరిలో మొదటి, రెండో కుమారులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు చనిపోయారు. అలాగే ఓ ఆడపిల్ల కూడా చనిపోయింది. చిన్నోడు రామాంజనేయులుతో పాటు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. మద్దిలేటి పేరుతో ఉన్న పొలాన్ని రెండో కుమారుడు వెంకటేశ్వర్లు భార్య భాగ్యమ్మకు మగపిల్లోడు ఉన్నారు. ఈమెతో పాటు తక్కిన నలుగురు ఆడపిల్లలకు సంబంధం లేకుండా మొత్తం పొలం దాన విక్రయం కింద తండ్రి తనకు రాసిచ్చినట్లు పాస్‌బుక్కులు సృష్టించారు. పరిహారం కోసం కోర్టులో 2018లో కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే రామాంజనేయులు మినహా తక్కిన మద్దిలేటి వారసులు పాస్‌బుక్కులు తమ తండ్రి పేరుతోనే ఉన్నాయని, నకిలీ పాసుపుస్తకాలు సృష్టించుకుని రామాంజనేయులు తమకు పరిహారం ఇవ్వకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీని వెనుక గ్రామానికి చెందిన టీడీపీ నేత ఉన్నారని చెబుతున్నారు.

నకిలీ పాసుపుస్తకాలు సృష్టించారు



మా మానాన్న మద్దిలేటికి 4.38 ఎకరాల పొలం ఉంది. ఇప్పటికీ పాసుపుస్తకాలు మా నాన్న పేరుతో ఉన్నాయి. అయితే మా ఆడపిల్లలతో పాటు మా సోదరుడు వెంకటేశ్వర్లు భార్య భాగమ్మ, ఆమె పిల్లలు బతికే ఉన్నారు. వారికి తెలియకుండా భూమి భాగ పరిష్కారాలు కాకుండా మొత్తం భూమి రామాంజనేయులు తీసుకున్నట్లు నకిలీ పాసుపుస్తకాలు సృష్టించారు. మా వద్ద మా నాన్న పాసుపుస్తకాలు ఉన్నాయి. దీనిపై అధికారులు విచారణ చేయాలి. అప్పటి వరకూ పరిహారం ఆపాలి. – మద్దిలేటి వారసులు



సాక్షి ప్రతినిధి కర్నూలు: ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో డీఆర్‌డీఓ(డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) కోసం 3,250 ఎకరాల భూమిని ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం సేకరించింది. పట్టా భూములకు, అసైన్డ్ భూములకు ప్రభుత్వం ఎకరాకు రూ.4.30లక్షల చొప్పున పరిహారం ఇచ్చింది. అయితే ఈ పరిహారం మంజూరులో కొందరు రైతుల పేర్లతో టీడీపీ నేతల భారీ కుంభకోణానికి పాల్పడ్డారు. 15-20 ఏళ్ల కిందట చనిపోయిన వారి పేర్లతో ఫోర్జరీ సంతకాలు చేసి పరిహారం పొందేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే 120మందికి పరిహారం అందింది. మరో 70మందికి పరిహారం మంజూరు కాగా, ఖాతాల్లో జమ కావల్సి ఉంది. అయితే ఈ పరిహారం మంజూరులో అక్రమాలు జరిగాయని ఇటీవలే బాధిత రైతు కుటుంబాలతో పాటు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. నిజమైన బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

వేలిముద్రలు ఫోర్జరీ చేసి కోర్టులో రిట్

పాలకొలనులో మాదిగ శేషమ్మకు అరెకరా పొలం ఉంది. ఈమె భూమిని డీఆర్‌డీఓ కోసం సేకరించారు. అయితే పొలంలో శేషమ్మ సాగులో లేదని పరిహారం తిరస్కరించారు. దీనిపై శేషమ్మకు తెలియకుండానే ఆమె పేరుతో హైకోర్టులో 2022లో రిట్(పిటిషన్ నెం.25654) దాఖలు చేశారు. పిటిషన్‌లో శేషమ్మ పేరుతో వేలిముద్రలు వేసి ఆమె పేరు రాశారు. నిజానికి ఈ విషయం ఆమెకు ఏమాత్రం తెలీదు. గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు తప్పుడు వేలిముద్రలతో శేషమ్మ పేరుతో రిట్ దాఖలు చేశారు. లేదంటే డ్వాక్రా సంఘంలో ఉన్న శేషమ్మ రుణాల లావాదేవీలలో గతంలో వేసిన వేలిముద్రలను ఫోర్జరీ చేసి ఉండొచ్చని శేషమ్మ అనుమానిస్తున్నారు. ఇప్పుడు ఈమె పేరుతో మంజూరైన పరిహారం శేషమ్మకు తెలియకుండానే టీడీపీ నేత ఖాతాలో జమ కానుంది.

వచ్చిన పరిహారంలో ఫిఫ్టీ.. ఫిఫ్టీ

పాలకొలనులో డీఆర్‌డీఓ కోసం వందల ఎకరాల భూమి సేకరించారు. ఇందులో కొందరు నిజమైన అర్హులు ఉంటే కొందరు భూమి లేకుండా కేవలం నకిలీ పట్టాలు సృష్టించి పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్న వారున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎవరైతే ప్రభుత్వం నుంచి అసైన్డ్‌భూములు పొంది, సాగులో లేకుండా ఉన్నారో వారికి పరిహారం నిరాకరించారు. ఇదే అదునుగా ఓ టీడీపీ నేత పరిహారం నిరాకరించిన కొందరి పేర్లతో వారికి తెలీకుండా వారి పేర్లతో కోర్టులో రిట్‌దాఖలు చేశారు. ఇది చూసి ఇంకొందరు రైతులు కూడా టీడీపీ నేతతో కలిసి వెళ్లి తమకూ పరిహారం ఇప్పించాలని కోరారు. దీంతో ఆ టీడీపీ నేత వచ్చే పరిహారంలో సగం తనకు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. తనకు వచ్చే సగంలో అధికారులకు వాటా ఇస్తానని చెప్పినట్లు తెలుస్తోంది.

శేష వాహనంపై అహోబిలేశుడు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూలమూర్తులను సోమవారం ఉదయం సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి, శ్రీ లక్ష్మీనరసింహస్వాములను యాగశాలలో కొలువుంచి అర్చన, అభిషేకం, తిరుమంజనం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉభయ దేవేరులతో శేషవాహనంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై కొలువైన జ్వాలా నరసింహస్వామి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.



శేష వాహనంపై ఉత్సవమూర్తులు

పీఎం కిసాన్‌తో కలిపే 'అన్నదాత సుఖీభవ'

కర్నూలు(అగ్రికల్చర్): 2024-25 సంవత్సరంలో అన్నదాత సుఖీభవ కింద చెల్లించే పెట్టుబడి సాయం ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం.. 2025-26 సంవత్సరానికి అన్నదాత సుఖీభవ అమలుకు చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు జారీ అయ్యాయి. గత ఏడాది మే నెలలో జరిగిన ఎన్నికల సమయంలో సూపర్-6 హామీల్లో భాగంగా తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏటా రైతులకు రూ.20 వేలు చెల్లిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల్లో వ్యతిరేకత పెరుగకుండా ఉండేందుకు ఈ ఏడాది అమలుకు మార్గదర్శకాలు జారీ చేసింది. పీఎం కిసాన్ కింద కేంద్రం రూ.6 వేలు, రాష్ట్రం రూ.14 వేలు వెరసి రూ.20 వేలు చెల్లిస్తుంది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను వ్యవసాయ శాఖ జారీ చేసింది. అయితే కుటుంబం యూనిట్(కుటుంబంలో ఒక్కరికి మాత్రమే) లబ్ధి కల్పిస్తారు.

అన్నదాతలకు తీవ్ర అన్యాయం

- రైతు భరోసా కేంద్రాలను నాశనం చేశారు
- టీడీపీ నాయకుల ఇళ్లలోకి ఎరువుల బస్తాలు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



కల్లంలోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

పాణ్యం: దేశానికి అన్నం పెట్టే రైతులకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి మండిపడ్డారు. అన్నదాతలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, ప్రభుత్వంపై పోరాడతామని చెప్పారు. పాణ్యం మండలం ఆలమూరు గ్రామంలో రైతులతో సోమవారం ముఖాముఖి నిర్వహించారు. పెట్టుబడి వ్యయం, గిట్టుబాటు ధర, సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో కాటసాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎరువులను టీడీపీ నాయకుల ఇళ్లలో ఉంచుతున్నారన్నారు. చేసేదేమి లేక రైతులు వేరే ప్రాంతానికి వెళ్లి యూరియా బస్తా రూ. 400 ప్రకారం కొనాల్సి వస్తోందన్నారు. కనీస మద్దతు ధర లేకపోవడంతో ధాన్యం కల్లాలు దాటడడం లేదన్నారు.

సాగు నీరు అందలేదు

'పది రోజులుగా కల్లాల్లో ధాన్యం ఉంచినా కొనుగోలు చేసేందుకు ఎవరూ రావడం లేదు' అని కన్నీటితో తమ కష్టాలను కాటసానికి రైతులు వివరించారు. 'సాగు నీరు సరిగ్గా రాలేదని, తెగుళ్ల ఎక్కువయ్యాయని, మందు బస్తాల రేటు చాలా పెరిగిందని.. ఇలా ఉంటే రైతులు ఏమి చేయాలి' అని వాపోయారు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల్లో బుకింగ్ చేస్తే ఊర్లోనే మందులు, విత్తనాలు, పనిముట్లు ఇచ్చేవారని, నాటి పరిస్థితులు నేడు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి బుద్ధి చెబుతారు

అన్నదాత సుఖీభవ కింద రూ. 20వేలు రైతులకు ఇస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేశారని కాటసాని అన్నారు. అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నాశనం చేశారన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతే ఒక్క పైసా పరిహారం ఇవ్వలేదన్నారు. మోసం చేస్తే ప్రభుత్వానికి రైతులే బుద్ధి చెబుతారన్నారు. జెట్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, మల్లు జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలక్ష్మయ్య, గోపాల్‌రెడ్డి, ఉపేంద్రారెడ్డి, దేవేంద్రరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, చంద్రోఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా లోపం.. పర్యవేక్షణ శూన్యం

మల్లన్న సన్నిధిలో భద్రత డొల్ల

- ఏకంగా గర్భగుడిలోని క్లాత్ హుండీని కోసి డబ్బు దొంగతనం
- ఇద్దరు మైనర్లకు మరో ఇద్దరి సహకారం
- ఈఓ ఆదేశాలతో శ్రీశైలం పీఎస్‌లో సీఎస్ఓ ఫిర్యాదు
- నిందితులు రిమాండ్‌కు తరలింపు
- విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

శ్రీశైలం టెంపుల్: కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్త దేవాలయాల పర్యవేక్షణ గాలికి వదిలేసింది. ఇటీవల తిరుమలలో చోటుచేసుకున్న తొక్కిసలాట, సింహాచలంలో గోడకూలిన ఘటన, శ్రీశైల దేవస్థానంలో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. కొన్ని నెలల క్రితం శ్రీశైలం టోల్‌గేట్‌లో చోటుచేసుకున్న అవినీతి కుంభకోణం, అలాగే టికెట్ల మార్ఫింగ్, ప్రస్తుతం హుండీ చోరీ ఘటనలు మల్లన్న సన్నిధిలో భద్రత డొల్లతనాన్ని బయటపెడుతోంది. శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి వార్ల దర్శనానికి నిత్యం భక్తులు వేలాదిగా తరలివస్తారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని భక్తులు కానుకలను సమర్పిస్తారు. ఇందుకోసం ఇనుప హుండీలు, క్లాత్ (గుడ్డ) హుండీలను దేవస్థానం ఏర్పాటు చేసింది. ఈ నెల 1వ తేదీన ఇద్దరు వ్యక్తుల సహకారం, ప్రోత్సాహంతో మరో ఇద్దరు మైనర్లు భక్తుల రూపంలో ఉచిత క్యూలైన్ ప్రవేశ మార్గం ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. గర్భగుడిలోని రత్నగర్భ గణపతి ఆలయం వద్దగల క్లాత్ (గుడ్డ)తో ఏర్పాటు చేసిన హుండీని బ్లేడ్‌తో కోసి అందులో నుంచి రూ.10,150 దొంగతనం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉందని తెలిసి కూడా అధికారుల అలసత్వాన్ని ఆసరాగా తీసుకుని దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. గర్భగుడిలో చోరీ ఘటనపై విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌ను దేవస్థాన కార్యనిర్వహణాధికారి సస్పెండ్ చేశారు. అలాగే కమాండ్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాలను పర్యవేక్షించాల్సిన సెక్యూరిటీ గార్డులు కూడా నిర్లక్ష్యం వహించారని ఇద్దరిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు.



శ్రీశైల ఆలయంలోని గర్భగుడిలో దొంగతనం చేస్తున్న మైనర్లు

శ్రీశైలం పర్యవేక్షణ గాలికి..

శ్రీశైలక్షేత్ర భద్రతను, పర్యవేక్షణను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో, ఉగాది మహోత్సవాల్లో సైతం భక్తులకు అరకొర సౌకర్యాలు కల్పించారని భక్తులు విమర్శించారు. అలాగే శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శివస్వామిపై వ్యాపారస్తులు దాడిచేసి గాయపరచిన ఘటన చోటుచేసుకుంది. టోల్‌గేట్‌లో అవినీతి కుంభకోణం చోటుచేసుకుంది. అంతేకాకుండా వీఐపీ బ్రేక్ స్పర్శదర్శనం టికెట్లను మార్ఫింగ్ చేసి భక్తులకు విక్రయించిన ఘటన తెలిసిందే. ప్రస్తుతం గర్భగుడిలో హుండీ చోరీ ఘటన కలకలం రేపుతోంది.

రెగ్యులర్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ లేని వైనం

శ్రీశైల దేవస్థాన భద్రతను పర్యవేక్షించేందుకు, ఉభయ దేవాలయాల్లోకి అసాంఘిక శక్తులు, నిషేధిత పదార్థాలు తీసుకెళ్లకుండా క్షేత్ర భద్రతను దేవస్థాన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు. అయితే గత కొన్ని నెలల నుంచి దేవస్థానం సీఎస్‌వో పోస్టు ఖాళీగా ఉంది. దేవస్థాన పర్యవేక్షకులకే ఇంచార్జి సీఎస్‌వోగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కాలం నెట్టుకొస్తున్నారు. అలాగే దేవస్థానంలో డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, లగేజి స్కానర్లు ఉన్నప్పటికీ అలంకారప్రాయంగానే ఉండిపోయాయి.

నలుగురికి రిమాండ్

హుండీ నగదు చోరీ కేసులో సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించాం. తెలంగాణకు చెందిన సంగనమోని రమేష్, అతనితో సహజీవనం చేసే కె.లక్ష్మీ, మరో ఇద్దరు మైనర్లను ఉచిత క్యూలైన్ వద్ద అదుపులోకి తీసుకున్నాం. వీరి నుంచి రూ.10,150 స్వాధీనం చేసుకున్నాం. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాం.
– జి.ప్రసాదరావు, శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్

త్వరలో భద్రతాధికారిని నియమిస్తాం

శ్రీశైల ఆలయంలో చోరీ సంఘటన జరగడం దురదృష్టకరం. దేవస్థానంలో ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి ఇటీవలే ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. దేవస్థాన సీఎస్‌వో పోస్టుకు అనేకసార్లు నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలోనే రిటైర్డ్ డీఎస్పీ స్థాయి అధికారిని, జూనియర్ కమాండెంట్ ఆఫీసర్‌ని శ్రీశైలం సీఎస్‌వోగా నియమించేందుకు చర్యలు చేపడుతున్నాం.
– ఎం.శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

క్లుప్తంగా

పులి దాడిలో ఆవు మృతి


పులి దాడిలో మృతిచెందిన ఆవు

వెలుగోడు: పులి దాడిలో ఆవు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పట్టణ సమీపంలో ఉన్న గట్టు తండాకు చెందిన శివ నాయక్ మద్రాస్ మెయిన్ కెనాల్ సమీపంలో ఉన్న పంట పొలంలో ఆవుల మందను నిల్వ ఉంచాడు. సోమవారం తెల్లవారుజామున మందపై పులి దాడి చేసి ఒక ఆవును చంపేసి నట్లు బాధితుడు వాపోయాడు. ఆవు మృతితో రూ.50 వేల నష్టం వాటిల్లిందన్నాడు.

పశు గ్రాసం దగ్ధం


దగ్ధమవుతున్న వరిగడ్డి

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె గ్రామ సమీపంలో సోమవారం విద్యుత్ ప్రమాదంలో ట్రాక్టర్‌పై తరలిస్తున్న పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రెడ్డిపల్లెకు చెందిన రైతు చిన్నక్రిష్ణయ్య తువ్వపల్లె సమీపంలోని రంగాపురం బావి వద్ద మరో రైతు నుంచి గ్రాసం కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు తాకి నిప్పులు చెలరేగడంతో గ్రాసానికి మంటలు వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తమై లిఫ్ట్ ద్వారా గ్రాసాన్ని కిందకు తోసేయడంతో ట్రాక్టర్‌కు ఎలాంటి నష్టం కలగలేదు. కానీ గ్రాసం పూర్తిగా కాలిపోవడంతో రైతుకు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆస్తి కోసం మేనత్తపై కత్తితో దాడి


గాయపడిన షేక్ రహమున్నిసా

బొమ్మలసత్రం: మేనత్తకు చెందిన ఆస్తిని రాసివ్వటం లేదని సొంత మేనల్లుడే కత్తితో దాడికి పాల్పడిన ఘటన నంద్యాలలో సోమవారం చోటుచేసుకుంది. అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలు.. నూనెపల్లిలో నివాసముంటున్న షేక్‌రహమున్నిసాకు అక్కడే రెండు భవనాలున్నాయి. ఆమె అన్న కుమారుడు అబ్దుల్ రహమాన్ పనిపాట లేకుండా ఖాళీగా తిరుగుతుంటాడు. ఈక్రమంలో ఒక ఇంటిని తన పేరుమీద రాసివ్వాలని మేనత్తను ఒత్తిడికి గురిచేసేవాడు. ఈనేపథ్యంలో రైల్వేస్టేషన్ సమీపంలో బంధువుల ఇంటికి వెళ్లి వస్తున్న రహమున్నిసాపై మేనల్లుడు కత్తితో దాడి చేశాడు. బాధితురాలికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకోవటంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. త్రీటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

వెళ్లింది కణితి కోసం.. దొరికింది పులి కళేబరం!

- ఘటనా స్థలానికి అధికారులను తీసుకెళ్లిన స్నిఫర్ డాగ్ డాలీ
- వేటగాళ్ల ఉచ్చులకు గాయపడుతున్న వన్యప్రాణులు
- పెబ్బేరు సంతలో పులి ఉచ్చులు బహిరంగ విక్రయాలు

ఉచ్చుకు కణితి బలైంది. ఈ విషయం స్నిఫర్ డాగ్ సాయంతో అధికారులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా మరింత సమాచారం కోసం స్నిఫర్ డాగ్‌కు కణితి మాంసం వాసన చూపి దాన్ని అనుసరించారు. అది ఏకంగా పులి కళేబరం ఉన్న చోటుకు తీసుకెళ్లింది. అది టి123 ఆడ పులి కళేబరంగా గుర్తించారు.


ఉచ్చు బారిన పడి మరణించిన పెద్దపులి (ఫైల్)


పులి వేటగాళ్లు తయారు చేయించుకున్న పులి ట్రాప్

ఆత్మకూరు రూరల్: స్థానిక అటవీ డివిజన్‌లోని ముసలి మడుగు సెక్షన్‌లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన టి123 ఆడ పులిని అటవీ శాఖ అధికారులు గుర్తించడంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి. సాధారణంగా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో వేటగాళ్ల భరతం పట్టేందుకు ఒక స్నిఫర్ డాగ్‌తో కూడిన దళాన్ని సాహెబ్ పీరా అనే అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. డాలి అనే శిక్షణ పొందిన వాసన పట్టే శునకంతో పాటు ఇద్దరు శిక్షకులు ఈ దళంలో ఉన్నారు. వన్యప్రాణి మాంసాన్ని గుర్తించడంలోనూ, ఉచ్చులను పట్టించడంలోనూ దళం నిరంతరం పని చేస్తుంటుంది. ఈ క్రమంలో ఇటీవల ముసలి మడుగు సెక్షన్‌లో ఒక కణితి వేటగాళ్ల ఉచ్చుకు బలైనట్లు గుర్తించారు. ఫుట్ పెట్రోలింగ్ పార్టీ కణితి తలను కనుగొనడంతో స్నిఫర్ డాగ్ డాలీతో కణితి తలను వాసన చూపి మరేమైనా ఆధారాలు లభిస్తాయేమోనని వెతికారు. ఆ క్రమంలో డాలీ.. పులి మరణించిన ప్రదేశానికి నేరుగా అధికారులను తీసుకెళ్లింది. అప్పటికే పులి మరణించి 20 రోజులు కావడంతో దాని కళేబరం పూర్తిగా డీకంపోజ్ అయిపోయింది. పులి చారలను పోల్చి అది టి123గా గుర్తించారు.

పెబ్బేరు సంతలో పులి ఉచ్చుల విక్రయాలు..

పెద్దపులిని వేటాడేందుకు ఇనుప గొలుసుతో కూడిన ఉచ్చు(ట్రాప్)లను వేటగాళ్లు ప్రత్యేకంగా తయారు చేయించుకుంటున్నారు. ఇలాంటి ట్రాప్‌లు తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా పెబ్బేరు సంతలో బహిరంగంగానే విక్రయిస్తూ కొందరు అటవీ అధికారులకు చిక్కారు. ట్రాప్‌లు విక్రయిస్తున్నారన్న సమాచారం తొలుత ఆత్మకూరు అటవీ డివిజన్ యాంటీ పోచింగ్ స్క్వాడ్‌కు అందడంతో వారు తెలంగాణ అధికారులతో కలిసి పథకం పన్ని అసలు నిందితులను పట్టుకునే ప్రయత్నం చేశారు. కానీ ఇంతలో తెలంగాణ అధికారులే దాడి నిర్వహించడంతో అసలు నేరస్తులు దొరకకుండా పారిపోగా.. ఓ అమాయక వృద్ధుడు మాత్రమే అరెస్ట్ అయ్యాడు. కాగా పులి ట్రాప్‌లను ఉత్తర భారతదేశ అంతర్జాతీయ వేటగాళ్లు మాత్రమే తయారు చేస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

వన్యప్రాణుల ప్రాణాలు తీస్తున్న ఉచ్చులు

నాగార్జునసాగర్ – శ్రీశైలం పులుల అభయారణ్యంలో పులి సంరక్షణకు వేటగాళ్ల వల్ల ఆటంకాలు ఏర్పడుతున్నట్లు ఇటీవలి ఘటనలను బట్టి తెలుస్తోంది. శాకాహార జంతువుల కోసం వేటగాళ్లు పన్నే ఉచ్చులు పెద్దపులుల పాలిట ప్రాణాంతకంగా మారుతున్న సంగతి పలు ఘటనలు రుజువు చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం ఓ పులి రుద్రకోడు సెక్షన్‌లో ఉచ్చు మెడకు బిగిసి దాన్ని తెంచుకుని గాయపడింది. అనంతరం గాలేరు నదిలో పడి మరణించింది. కళేబరం ఒడ్డుకు కొట్టుకు వచ్చిన ఘటన అప్పట్లో వెలుగుచూసింది. యేడాది క్రితం కూడా టి123 కూడా ఇలాగే ఉచ్చుకు చిక్కి తప్పించుకునే క్రమంలో నడుము బిగిసి గాయపడింది. గాయాలతోనే తిరుగుతున్న పులిని ఇన్‌ఫ్రా రెడ్ కెమెరాల ద్వారా గుర్తించిన అధికారులు.. ట్రాంక్విలైజ్ చేసి ఉచ్చును తొలగించి వైద్యం చేసి అడవిలో వదిలారు. ఆ తరువాత కొంత కాలం స్వేచ్ఛగా తిరిగిన పులి.. అంతర్గత ఇన్‌ఫెక్షన్ల కారణంగా ప్రస్తుతం చనిపోయినట్లు తెలుస్తోంది. తరచూ కొత్తపల్లె, ఆత్మకూరు మండలాల పరిధిలోని నల్లమలలో ఉచ్చులు లభ్యమవుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

రెట్టింపు లాభం అంటూ మోసం చేశారు

- అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు


పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా

కర్నూలు: ఇన్‌స్టాగామ్‌లో స్టాక్ మార్కెట్ గురించి ఒక ప్రకటన ఇచ్చి వాట్సాప్ గ్రూప్‌లో లింక్ పంపి ఇద్దరు వ్యక్తులు తనతో చాట్ చేసి ఒక యాప్ ఇచ్చి, అకౌంట్ నెంబర్ ఇచ్చి పెట్టిన పెట్టుబడికి రెట్టింపు లాభాలు చూపిస్తూ ఆ డబ్బులు ఇవ్వాలంటే ఇన్‌కమ్ ట్యాక్స్ కట్టాలని రూ.5 లక్షలు తీసుకుని సైబర్ మోసానికి గురిచేశారని కర్నూలుకు చెందిన సునిత అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరాకు ఫిర్యాదు చేశారు. కర్నూలు టూటౌన్ పక్కనున్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం అడిషనల్ ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 111 ఫిర్యాదులు రాగా వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస నాయక్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- చెత్త బండి ఇప్పిస్తామని చెప్పి రూ.3.30 లక్షలు తీసుకుని ధనుంజయ్, జానకిరామ్ అనే వ్యక్తులు మోసం చేశారని కృష్ణగిరి మండలం ఆలంకొండ గ్రామానికి చెందిన బంగారి ఫిర్యాదు చేశారు.
- 10 ఎకరాల ఆస్తిని ఇద్దరు కొడుకులు సమానంగా పంచుకున్నారని, వచ్చిన పెన్షన్ డబ్బు కూడా వారే తీసుకుని తన బాగోగులు పట్టించుకోవడం లేదని, విచారణ జరిపి తనకు జీవనాధారం కలిగించాలని ఆస్పరి మండలం కైరుప్పల గ్రామానికి చెందిన అంగడి శివమ్మ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు సంతోష్ నగర్ వద్ద ఉన్న విజయ నగర్ కాలనీలో మార్ట్‌గేజ్ చేసిన ఒక ప్రాపర్టీని అమ్ముతామని చెప్పి కొందరు బ్రోకర్లు అడ్వాన్స్‌గా డబ్బులు తీసుకుని తనతో పాటు చాలా మందిని మోసం చేశారని కర్నూలు బాలాజీ నగర్‌కు చెందిన రెహమాన్ ఫిర్యాదు చేశారు.
- రూ.2 లక్షల విలువైన కంది పంటను నాశనం చేసి నా కుటుంబాన్ని మానసికంగా, ఆర్థికంగా కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విచారణ జరిపి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామానికి చెందిన మాదమ్మ ఫిర్యాదు చేశారు.

స్కూల్ లేదని తాగునీరు బంద్!

- పది రోజులుగా బసవాపురం గ్రామస్తులకు నీటి సమస్య


కనెక్షన్ కట్ చేసిన బోరు మోటారు

మహానంది: వేసవి సెలవులని పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ పంపు కనెక్షన్ కట్ చేయడంతో బసవాపురం గ్రామస్తులకు తాగు నీటి సమస్య నెలకొంది. బసవాపురంలో రెండు చోట్ల నీటి ట్యాంకులున్నాయి. ఎంపీపీ పాఠశాల వద్ద ఉన్న మోటార్‌కు కనెక్షన్ తీసేయడంతో నీటి సమస్య తలెత్తింది. గ్రామంలో వాటర్ ఫిల్టర్ ట్యాంకులు సైతం లేకపోవడంతో ఇదే నీటిని ప్రజలు తాగుతుంటారు. ఉన్న రెండు మోటార్ల వద్ద సరఫరా అయ్యే నీళ్లలో పాఠశాల వద్ద ఉన్న నీళ్లే బాగుంటాయని, అధికారులు స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్‌ను ఆరా తీయగా.. ఇంత వరకు గ్రామస్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, అయినా మరమ్మతులు చేయించి పునరుద్ధరిస్తామని తెలిపారు.

నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

- నలుగురిపై కేసు నమోదు


గుడుంబాయి తండాలో సారా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కర్నూలు: గుడుంబాయి తండా గ్రామ శివారులోని నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, కర్నూలు స్టేషన్ సీఐ చంద్రహాస్ తమ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి సోమవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించి బట్టీలను ధ్వంసం చేశారు. దాదాపు నాటుసారా తయారీకి ఉపయోగించే 1,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 45 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీదారులు మాదావత్ దన్ను నాయక్, నానావత్ రాజు నాయక్, మాదావత్ మద్దిలేటి నాయక్, నానావత్ రమేష్ నాయక్ తదితరులపై కేసు నమోదు చేశారు. నవోదయం 2.0లో భాగంగా గ్రామ సభ నిర్వహించి నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు జరిపితే తీసుకునే చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఓర్వకల్లును పారిశ్రామికంగా తీర్చిదిద్దుతాం


పార్కును ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత, కలెక్టర్ రంజిత్ బాషా

ఓర్వకల్లు: ఓర్వకల్లు ప్రాంతాన్ని పారిశ్రామికంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం మండలంలోని గుట్టపాడు గ్రామం వద్ద రూ.38.50 కోట్లతో నిర్మించిన ఎంఎస్‌ఎంఈ పార్కును ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కలెక్టర్ రంజిత్ బాషా, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ సరైన శిక్షణ, చదువు ఉంటేనే ఉద్యోగాలు వస్తాయన్నారు. స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే ఓర్వకల్లులో పైలట్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, దానికి ఖర్చు ఎక్కువగా ఉన్నప్పటికీ త్వరగా మంచి సంపాదన ఉంటుందని, యువత పైలెట్ కోర్సుల వైపు ఆసక్తి చూపాలని సూచించారు. ఈ పార్కుకు అవసరమైన దూపాడు నుంచి ఓర్వకల్లు మీదుగా బేతంచెర్ల వరకు రైల్వే లైనింగ్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయన్నారు. ఇండస్ట్రీయల్ హబ్ కోసం ఏర్పాటు చేస్తున్న నీటి సౌలభ్యం పనులు 90 శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. చిన్న తరహా పరిశ్రమల పార్కులు, స్టార్టప్‌లు ఎవరైతే ఎంఎస్‌ఎంఈలుగా మారాలనుకున్నారో, వారందరికీ అవకాశం కల్పించేందుకుగాను 7 నియోజకవర్గాల్లో భూమిని గుర్తించామన్నారు. ప్రస్తుతం మొట్టమొదటి సారిగా జిల్లాలోని ఓర్వకల్లు మండలంలోని గుట్టపాడు వద్ద ప్రారంభించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్, ఆర్‌డీఓ సందీప్‌కుమార్, మండల మహిళా సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం అరుణకుమారి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ కార్డులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (అర్బన్): ఈ–శ్రమ్ కార్డులపై కార్మికులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వ శాఖల అధికారులపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సూచించారు. సోమవారం న్యాయ సేవా సదన్‌లో ఆశా వర్కర్లకు ఈ–శ్రమ్ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు వెంకట హరినాథ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి ఈ–శ్రమ్ కార్డు అందేలా కృషి చేయాలన్నారు. ఈ–శ్రమ్ కార్డుల వల్ల లభించే ఉపయోగాలను ప్రతి కార్మికుడికి తెలియజేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ శాంతికళ మాట్లాడుతూ తమ డిపార్ట్‌మెంట్‌లో ఆశా వర్కర్లందరూ ఈ–శ్రమ్ కార్డులు పొందారని తెలిపారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆశా వర్కర్లకు ఈ–శ్రమ్ కార్డులు పోర్టల్‌లో ఎలా నమోదు చేయాలో వివరించారు. కార్డులు పొందిన వారికి ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ప్రతి కార్మికునికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద బీమా ఉచితంగా కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్‌మెంట్ లీగల్ ఆఫీసర్ సుమలత పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం


దాతను సత్కరిస్తున్న ఏఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం నెల్లూరుకు చెందిన ఎస్.రామాంజనేయులు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. దాతకు ఏఈఓ స్వాములు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందించి సత్కరించారు.

బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ప్రారంభం


బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ప్రారంభిస్తున్న మంత్రులు

నంద్యాల(అర్బన్): స్థానిక కేసీ కెనాల్ కాంపౌండ్‌లోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయ భవనంలో సోమవారం సాయంత్రం అత్యాధునిక వసతులతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను మంత్రులు ఎన్‌ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు హెంద్రీ డ్యూనంట్ చిత్రపటానికి మంత్రులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ మాట్లాడుతూ రక్తం దొరక్క ఏ ఒక్కరూ మరణించకూడదనే ఉద్దేశంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, గౌరవ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో రక్తం అవసరం ఉన్న వారికి సరైన సమయంలో అందించడానికి ఇతర జిల్లాలోని రక్తనిల్వ కేంద్రాల మీద ఆధార పడకుండా మన జిల్లాలోనే రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో రెడ్ క్రాస్ సంస్థ వారి సహకారంతో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రతి నియోజకవర్గంలో కూడా ఒక సబ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, డీఈఓ జనార్దన్ రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జప్రుల్ల, సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఖలందర్, రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పాల్గొన్నారు.

ఉచిత పుస్తకాలకు నమోదు చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత పొందిన నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్ల విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు మన ఊరు–మన గుడి, మన బాధ్యత గౌరవ అధ్యక్షులు శివకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 9440601125, 9490990624లకు ఫోన్ చేసి ఈనెల 10వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 19న బయటిపేటలోని ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద నోటు పుస్తకాలు పంపిణీ చేస్తామని, విద్యార్థులు ఆధార్ కార్డు, పదవ తరగతి మార్కుల కాపీతో హాజరు కావాలని సూచించారు.

పీజీఆర్‌ఎస్‌కు 93 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి ప్రజల నుంచి 93 వినతులు అందాయి. జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చి అర్జీదారులు వినతులు అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వినతుల్లో చట్టపరమైన సమస్యలను అక్కడికక్కడే ఆయా స్టేషన్ అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అన్నదమ్ముల ఆస్తి తగాదాలు, నగదు మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసం, అత్తింటి వేధింపులు తదితర ఫిర్యాదులను విచారించి చర్యలు తీసుకోవాలని సూచించారు. తమ దృష్టికి వచ్చిన వినతులు తిరిగి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐలు మోహన్‌రెడ్డి, సూర్యమౌళి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు

- ముగ్గురి పరిస్థితి విషమం


ప్రమాదంలో దెబ్బ తిన్న కారు

చాగలమర్రి: మండలంలోని నగళ్లపాడు గ్రామ సమీపంలోని 40వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్ చందానగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్ తన కుటుంబ సభ్యులతో కారులో తిరుపతికి బయలు దేరారు. మార్గమధ్యలోని నగళ్లపాడు వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. అంతటితో ఆగక ఎదురుగా వచ్చే హైదరాబాద్ బండ్లగూడ కాళికామందిర్‌కు చెందిన మందా అశోక్ రెడ్డి కారును ఢీకొంది. ప్రమాదంలో అశోక్ రెడ్డి, అతని కుమారుడు నరేన్, మరో మహిళ సరితతో పాటు ప్రమాదానికి కారణమైన కారులోని శ్రీకాంత్, మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను టోల్ ప్లాజా అంబులెన్సులో స్థానిక కేరళ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి తీవ్రంగా ఉన్న ముగ్గురిని నంద్యాల ఉదయానంద ఆసుపత్రికి తరలించారు. అశోక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా అశోక్ రెడ్డి తన తల్లిదండ్రుల పెళ్లి రోజును పురస్కరించుకుని అరుణాచలం వెళ్లి తిరిగి హైదరాబాదుకు వెళ్తుండగా ప్రమాదం చేసుకున్నట్లు సమాచారం.

శ్రీశైల దేవస్థానం ఏఈపై వేటు

- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కుర్చీల కొనుగోలులో అక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం ఇంజినీరింగ్ విభాగంలో అక్రమాలపై దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు కొరడా ఝులిపించారు. సోమవారం దేవస్థానంలో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ భవన్‌కుమార్‌ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్యూకంపార్ట్‌మెంట్లలో భక్తులు సేద తీరేందుకు కుర్చీలు కొనుగోలు చేశారు. పరిపాలనాంశాలలో భాగంగా ఆదివారం దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు క్యూకంపార్ట్‌మెంట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యత లేని కుర్చీలు కొనుగోలు చేసినట్లు ఈఓ గుర్తించారు. ఈ మేరకు ఏఈ భవన్‌కుమార్‌ను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. అలాగే ఇంచార్జి డీఈ చంద్రశేఖర శాస్త్రికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ప్రమాదపుటంచున ప్రయాణం


హొలహర్వి – గూళ్యం గ్రామాల మధ్య ఆటోలో కిక్కిరిసి వెళ్తున్న వ్యవసాయకూలీలు

రోజూ ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు మృత్యువాత పడుతుండగా ఇంకొందరు అవిటివాళ్లవుతున్నారు. అయినా అటు ప్రయాణికులు కానీ.. ఇటు వాహనదారులు కానీ మేల్కోవడం లేదు. రోడ్ల భద్రత వారోత్సవాల పేరుతో పోలీసు అధికారులు సైతం నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నా.. కాసులకు కక్కుర్తి పడి వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. ప్రమాదమని తెలిసినా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఐదారుగురు ప్రయాణించే ఆటోలో ఏకంగా 30 మందిని ఎక్కించుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు.

– ఆలూరు